సాక్షి ఖమ్మం

గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



ముకుందా.. మురారీ!

జిల్లాలో గురువారం శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని జరుపుకునేందుకు భక్తులు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఆలయాలను ముస్తాబు చేశారు. 8లో



రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతి

ఏన్కూరు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సుజాతనగర్ మండలానికి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
31° / 24°

వాతావరణం

జిల్లావ్యాప్తంగా గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షపాతం నమోదవుతుంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ డీసీపీ



సీపీ వారియర్‌కు పూలమొక్క అందజేస్తున్న అదనపు డీసీపీ

ఖమ్మంక్రైం: ఖమ్మం అడిషనల్ డీసీపీ(శాంతిభద్రతలు)గా కేఆర్‌కే.ప్రసాద్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా నల్లగొండ ఏఎస్పీగా ఉన్న ఆయనను ఖమ్మం బదిలీ చేశారు. ఈమేరకు బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన సీపీ విష్ణు ఎస్.వారియర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి



రైతులకు కూపన్లు అందజేస్తున్న అనసూర్య

కొణిజర్ల: రైతుల ఆయిల్‌పామ్‌తో లాభాలపై అవగాహన పెంచుకుని సాగుపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనసూర్య సూచించారు. మండలంలోని గుమ్మగుర్తి రైతు వేదికలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నీటి వసతి ఉన్న ప్రతీ రైతు ఆయిల్‌పామ్ సాగు చేసుకోవచ్చని, ప్రభుత్వం ద్వారా సబ్సిడీ మొక్కలు అందజేయడమే కాక డ్రిప్ పరికరాలకు కూడా సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. అనంతరం ఈ ఏడాది ఆయిల్‌పామ్ సాగు చేసి మొక్కలు చనిపోయిన రైతులకు కొత్త మొక్కలకు సంబంధించి కూపన్లను ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ బాలాజీ హార్టికల్చర్ అధికారి వేణు, ఏఈఓ ఆఫ్రిన్, గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.


డయల్ 100కు 3,569 ఫోన్లు

ఖమ్మంక్రైం: ఆపదలో ఉన్న వారికి పోలీసు సాయం అందించేందుకు ఏర్పాటైన డయల్ 100కు ఆగస్టులో 3,569 మంది ఫోన్ చేశారు. ఇందులో 81 ఫోన్లకు సంబంధించి కేసులు నమోదు చేసినట్లు సీపీ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. వీటిలో మహిళలపై వేధింపులు, చోరీలు, ప్రమాదాలు, అనుమానాస్పద మరణాలతో పాటు ఇతర కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. కాగా, కొందరికి అవగాహన లేకపోవడంతో డయల్ 100కు తప్పుడు సమాచారం ఇస్తున్నారని, అలా కాకుండా అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సద్వినియోగం చేసుకోవాలని సీపీ సూచించారు.

లోక్ అదాలత్‌ది అంతిమతీర్పు

ఖమ్మంలీగల్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి కె.ఉమాదేవి సూచించారు. ఈనెల 9న లోక్ అదాలత్ జరగనుండగా బుధవారం న్యాయవాదులు, పోలీసు అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా జడ్జి మాట్లాడారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమమైనదని, ఎలాంటి అప్పీల్ ఉండదనే విషయాన్ని కక్షిదారులకు వివరించాలని సూచించారు. క్రిమినల్ కేసుల్లో రాజీ పడితే శాంతిభద్రతలు మెరుగవుతాయని, కుటుంబ తగాదా కేసులను పరిష్కరించుకుంటే కుటుంబ బంధాలు పెరుగుతాయని తెలిపారు. కాగా, యునైటెడ్ ఇండియా బీమా కంపెనీకి సంబంధించి నష్టపరిహారం కేసుల పరిష్కారానికి ఈనెల 8న ముందస్తు లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా జడ్జి వెల్లడించారు. ఈ సమావేశంలో న్యాయసేవా సంస్థ కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ జావేద్‌పాషా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలించిన డీఏఓ



బీర తోటలో పరిశీలిస్తున్న డీఏఓ సరిత

ఎర్రుపాలెం: మండలంలోని కాచారంలో బుధవారం జిల్లా వ్యవసాయాధికారి సరిత పర్యటించారు. ఈసందర్భంగా రైతులు సాగు చేసిన వరి, మిర్చి, పత్తి పంటలతో పాటు బీరతోటలను పరిశీలించారు. పత్తి, మిర్చి పంటలను తెగుళ్లు ఆశిస్తున్న నేపథ్యాన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. అవసరమైతే రైతులు స్థానిక ఏఈఓ సలహాలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, ఏఈఓలు జిష్ణు పాల్గొన్నారు.

తల్లాడ మండలం మంగాపురం వద్ద మిర్చి తోటలో నిలిచిన వర్షపు నీరు



వాన జోరు..!

జిల్లాలో ఆశాజనకంగా వర్షం

- ఖమ్మం అర్బన్‌లో అత్యధికంగా 7.76 సెం.మీ.
- లోటు స్థితి నుంచి మెరుగవుతున్న వర్షపాతం
- పంటలపై రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యాప్తంగా వానలు జోరందుకున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా మూడు రోజులుగా వానలు కురుస్తున్నాయి. జిల్లాలో సోమవారం జల్లులతో తేలికపాటిగా ప్రారంభమైన వాన మంగళవారానికి కొంత మేర పుంజుకుని పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షపాతం నమోదైంది. ఇక మంగళవారం రాత్రి మాత్రం జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.

ఖమ్మం అర్బన్‌లోనే అత్యధికం

వాతావరణ శాఖ బుధవారం ఉదయం విడుదల చేసిన నివేదిక ప్రకారం జిల్లాలో సగటున 41.5 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆరు మండలాల్లో 6–12 సెం.మీల మధ్య భారీ వర్షపాతం నమోదు కాగా తొమ్మిది మండలాల్లో 3–6 సెం.మీ మధ్య సాధారణ వర్షపాతం, మిగిలిన ఆరు మండలాల్లో 1–3 సెం.మీ మధ్య తక్కువ వర్షపాతం నమోదైంది. కాగా, ఖమ్మం నగరంలో అత్యధికంగా 77.6 మి.మీ. వర్షపాతం నమోదు కాగా... అత్యల్పంగా పెనుబల్లి మండలంలో 5.2 మి.మీల వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు.

గత నెలంతా లోటే...

ఈ ఏడాది వర్షపాతం ఒడుదుడుకుల నడుమ సాగుతోంది. జూన్, ఆగస్టు నెలల్లో లోటు వర్షపాతం.. జూలైలో మాత్రం అధిక వర్షపాతం నమోదైంది. మళ్లీ సెప్టెంబర్‌లో వానలు పుంజుకుంటున్నాయి. తొలకరి సమయానికి జూన్‌లో సాధారణ స్థాయిలో కూడా వానలు పడలేదు. ఆ నెల సాధారణ వర్షపాతం 124.6 మి.మీలు కాగా 49.5 మి.మీ.గానే నమోదైంది. ఇక జూలైలో సాధారణ వర్షపాతం 249.6 మి.మీ.కు గాను 445.6 మి.మీల వర్షపాతం నమోదైంది. అంటే 78.5 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఆతర్వాత ఆగస్టులో సాధారణ వర్షపాతం 249.0 మి.మీ.లు కాగా కేవలం 64. మి.మీల వర్షపాతం మాత్రమే నమోదు కావడంతో లోటు నెలకొంది. ఇక ఈనెల 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు 36.4 మి.మీ.ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 56.8 మి.మీల వర్షపాతం నమోదైంది. దీంతో వర్షపాతం లోటు స్థితి నుంచి కొంత మేర సాధారణ స్థితికి చేరినట్లయింది. అయితే, జూన్ నుంచి ఇప్పటి వరకు వరకు పరిశీలిస్తే వర్షపాతంలో కామేపల్లి మండలం మొదటి స్థానంలో ఉండగా, 13 మండలాలు సాధారణ వర్షపాతం, ఏడు మండలాలు లోటు వర్షపాతంతో కొనసాగుతున్నాయి.

పలు మండలాల్లో బుధవారం నమోదైన వర్షపాతం (మి.మీ.ల్లో)

మండలం	వర్షపాతం
ఖమ్మం అర్బన్	77.6
కూసుమంచి	73.6
ఖమ్మం రూరల్	72.6
తిరుమలాయపాలెం	69.4
వైరా	67.2
ముదిగొండ	64.6
చింతకాని	60.2
కొణిజర్ల	56.4
రఘునాథపాలెం	50.2

జాగ్రత్తలు తప్పనిసరి

జిల్లాలో వరుసగా మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పంటలకు ప్రయోజనకరమని రైతులు భావిస్తున్నారు. అయితే, మిర్చి, పత్తి చేన్లలో నీరు నిలవడంతో ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యాన జిల్లా వ్యవసాయ అధికారి బి.సరిత పలు మండలాల్లో బుధవారం పర్యటించారు. పత్తి, మిర్చి పంటలను పరిశీలించి వర్షపు నీటిని తొలగించాలని సూచించడంతో పాటు తెగుళ్ల నివారణలపై అవగాహన కల్పించారు.

'పంట' పండినట్లేనా?

పంటల సాగులో నిమగ్నమై వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్న రైతుల్లో ప్రస్తుతం కురుస్తున్న వానలు ఆశలు చిగురింపచేశాయి. జూన్‌లో అంతగా వానలు లేకపోయినా పొడి దుక్కుల్లోనే పత్తి విత్తనాలు పెట్టారు. అరకొర జల్లులతో విత్తనాలు మొలిచినా పంట ఆశాజనకంగా కానరాలేదు. జూలైలో భారీ వర్షాలు కురవగా, తేమ పెరగటంతో పైర్లు దెబ్బతినే పరిస్థితి వచ్చింది. కాగా, జూలైలో కురిసిన వర్షాలతో జిల్లాలోని జలాశయాలు నిండగా భూగర్భ జలాల మట్టం పెరిగింది. దీంతో వరి సాగుకు కలిసొచ్చింది. అయితే, విస్తారంగా వర్షాలు కురిసినప్పటికీ జిల్లాకు ప్రధాన నీటి వనరైన నాగార్జునసాగర్‌కు ఆధారంగా ఉన్న కృష్ణా నదీ పరీవాహకంలో వర్షాలు లేకపోవడంతో సాగర్‌లో నీటిమట్టం పెరగలేదు. అయితే, భూగర్భ జలాలు, స్థానిక జలాశయాల ఆధారంగా పలువురు రైతులు వరి నాట్లు వేశారు. అయినప్పటికీ జిల్లాలో వరి సాగు అంచనా 2.80 లక్షల ఎకరాలు కాగా ఇప్పటి వరకు 2.25 లక్షల ఎకరాల దాటలేదు. అదే తరహాలో పత్తి కూడా 2.21 లక్షల ఎకరాలు గాను 1.82 లక్షల్లోనే సాగు చేశారు. ఇదేసమయాన మిర్చి సాగు మాత్రం పెరుగుతూ 65 వేల ఎకరాలకు చేరింది. కాగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఈ మూడు పంటకు ప్రయోజనం చేకూర్చేలా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. అంతేకాక మిర్చి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశముందని తెలుస్తోంది.

షాదీఖానాలకు రూ.4 కోట్లు

- పాత షాదీఖానాలో పనులకు రూ.2 కోట్లు
- కొత్త షాదీఖానా నిర్మాణానికి మిగతా నిధులు
- సీక్వెల్ వద్ద 1.20 ఎకరాల స్థలం కేటాయింపు
- నిధుల మంజూరుపై మంత్రి పువ్వాడ హర్షం



షాదీఖానా వద్ద బాణసంచా కాలుస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలో షాదీఖానాలకు రాష్ట్రప్రభుత్వం రూ.4 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం ఉన్న షాదీఖానా అభివృద్ధితో పాటు.. మరో షాదీఖానా నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నగరంలో రెండో షాదీఖానా నిర్మాణానికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి ఇటీవల సీక్వెల్ వద్ద ప్రభుత్వ శిఖం భూమిలో శంకుస్థాపన చేశారు. అక్కడి సర్వే నంబర్ 234లోని 1.20 ఎకరాల స్థలాన్ని షాదీఖానా–ఉర్దూఘర్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదల చేయగా.. ఇప్పుడు నిర్మాణానికి నిధులు కూడా కేటాయించారు. ప్రస్తుతం ఉన్న షాదీఖానా–ఉర్దూఘర్ సరిపోవడం లేదని, మరో షాదీఖానా నిర్మించాలని ముస్లింలు కోరుతుండగా.. నిధులు మంజూరు చేయడంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే టెండర్లు

నూతన షాదీఖానా నిర్మాణానికి స్థలాన్ని కేటాయించడమే కాక నిధులు మంజూరు చేసిన నేపథ్యాన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు టెండర్ల ప్రక్రియ చేపట్టారు. కాగా, సీక్వెల్ పక్కన రూ.40 కోట్ల విలువైన 1.20 ఎకరాల భూమిని రెండో షాదీఖానా కోసం ప్రభుత్వం కేటాయించడంపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ముస్లిం, మైనార్టీల అభివృద్ధి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు. తన విజ్ఞప్తితో స్పందించి నిధులు కేటాయించిన సీఎం కేసీఆర్‌తో పాటు హోం శాఖ మంత్రి మహమూద్ అలీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అలాగే, మంత్రి క్యాంపు కార్యాలయంలో సిటీ సెంట్రల్ లైబ్రరీ చైర్మన్ మహమ్మద్ అష్రఫ్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జొహరా, కార్పొరేటర్ షేక్ మక్బూల్ తదితరులు బుధవారం మాట్లాడుతూ నూతన షాదీఖానా నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించడంతో పాటు నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. మంత్రి పువ్వాడ అజయ్ ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేయించారని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు షౌకత్ అలీ, ఇషాక్, బాజీబాబా, సాద్, సలీం, ముజాహిద్, ఫయాజ్, అబ్దుల్ ఖయ్యూం, అబ్దుల్ కరీం, మోసిన్ పాల్గొన్నారు. అనంతరం వారు ప్రస్తుత షాదీఖానా వద్ద బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

రైల్వేలైన్‌కు ముందడుగు

- డోర్నకల్ – మిర్యాలగూడ లైన్‌కు ఫైనల్ సర్వే
- మంజూరు చేసిన రైల్వే మంత్రిత్వ శాఖ
- ఇప్పటికే జిల్లాలో ప్రాథమిక సర్వే పూర్తి

ఖమ్మంమామిళ్లగూడెం: డోర్నకల్–మిర్యాలగూడ కొత్త రైల్వేలైన్ నిర్మాణంలో ముందడుగు పడింది. రైల్వే మంత్రిత్వ శాఖ వివిధ ప్రాంతాలను అనుసంధానం చేయడంలో భాగంగా ఈ లైన్‌కు ఫైనల్ లొకేషన్ సర్వే(ఎఫ్‌ఎల్‌ఎస్) మంజూరు చేసింది. తెలంగాణలో దాదాపు 15 కొత్త రైల్వే లైన్ల కోసం ఎఫ్‌ఎల్‌ఎస్ మంజూరు చేయగా.. అందులో డోర్నకల్–మిర్యాలగూడ లైన్ కూడా ఉంది.

120 కి.మీ... రూ.2,160 కోట్లు

డోర్నకల్–మిర్యాలగూడ రైల్వే లైన్ దాదాపు 120 కి.మీ. మేర నిర్మించే అవకాశముంది. ఈ లైన్ నిర్మాణానికి రూ.2,160 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. కొత్త లైన్ జిల్లాలోని నేలకొండపల్లిని కలుపుతూ కోదాడ, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మీదుగా వెళ్తుంది. దీంతో ఈ ప్రాంత సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడుతుందని, హైదరాబాద్‌కు వెళ్లివచ్చే ప్రయాణికులకు అదనపు లైన్ అందుబాటులోకి వస్తుందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.

అనుసంధానం.. అదనం

కొత్త రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే డోర్నకల్, మిర్యాలగూడ మీదుగా హైదరాబాద్, విజయవాడ, చెన్నై, న్యూఢిల్లీకి అదనపు మార్గం అందుబాటులోకి వచ్చినట్లవుతుంది. ఈ లైన్‌ను ప్రధానంగా సింగరేణి నుంచి యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు బొగ్గు రవాణా కోసం నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే, సూర్యాపేట జిల్లాలోని పారా బాయిల్డ్ రైస్ మిల్లుల నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు ఆహార ధాన్యాల రవాణాకు ఈ లైన్ ఉపయోగపడుతుంది. కాగా, ఇప్పటికే ఈ మార్గంలో రైల్వే లైన్ నిర్మాణానికి ప్రాథమిక సర్వే పూర్తి చేశారు. దీంతో బడ్జెట్ కేటాయించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుండగా... ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్‌ఎల్‌ఎస్) మంజూరు చేసినట్లు తెలిసింది. ఈ సర్వే ద్వారా లైన్ వెళ్లే మార్గంపై స్పష్టత వస్తుంది.

బీటీ రహదారులకు రూ.95.53 కోట్లు

- గిరిజనప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి మంజూరు
- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన ఎంపీ నామ



ఎంపీ నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.95,53,31,000 నిధులు మంజూరు చేసింది. ఈ విషయాన్ని ఎంపీ నామ నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నిధులతో గిరిజన గ్రామల్లోని రహదారులకు మహర్దశ పట్టనుందని పేర్కొన్నారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దాదాపు అన్ని ఏజెన్సీ మండలాల్లో ఈనిధులతో రహదారులు నిర్మించనుండగా, ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని వైరా, కొణిజర్ల, ఏన్కూరు, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, కారేపల్లి, కామేపల్లి, జూలూరుపాడు, అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, చండ్రుగొండ, చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం, వాజేడు, పాల్వంచ, కొత్తగూడెం, పినపాక, ఆళ్లపల్లి, మణుగూరు, అశ్వాపురం, కరకగూడెం, గుండాల, బూర్గంపాడు, బయ్యారం, గార్ల, టేకులపల్లి మండలాల్లోని గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మానానికి ఈ నిధులు విని యోగించనున్నట్లు చెప్పారు. గిరిజన, దళిత గ్రామాలకు కనీస సౌకర్యాల కల్పనకు సీఎం కేసీఆర్ పెద్ద పీట వేసిన నేపథ్యాన సీఎంతో పాటు మంత్రి కేటీఆర్‌కు ఎంపీ నామ నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్ల నిర్మాణం ఇలా..

జూలూరుపాడు మండలం అనంతారం–నల్లబండ బోడు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4.50 కోట్లు, తవిసగుట్ట తండా – మాచినేనిపేట తండా హరిజన వాడకు రూ.కోటి, భోజ్యతండా–రాజరావుపేట రోడ్డు నిర్మాణానికి రూ.కోటి, కొణిజర్ల మండలం పెడబ్బ్యా రోడ్డు నుంచి(వయా లాలాపురం) శాంతినగర్ ఎస్టీ కాలనీ వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.4.10 కోట్లు మంజూరయ్యాయి. అలాగే, ఏన్కూరు మండలం హిమాంనగర్–భద్రు తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు, కారేపల్లి మండలం రాయగూడెం–రూక్కీ తండాకు రూ.80 లక్షలు, కామేపల్లి మండలం రూక్కీతండాకు రూ.80 లక్షలు, సింగరేణిలో రోడ్డుకు రూ.80 లక్షలు, కారేపల్లిలో నిర్మించే రోడ్డుకు రూ.2 కోట్లు, తిరుమలాయపాలెం మండలం చంద్రు తండా ఆర్ అండ్ బీ రోడ్డు – జాతీయ రహదారి 365 వరకు నిర్మించే రహదారికి రూ.80 లక్షలు కేటాయించారు. ఇంకా ఆర్‌అండ్ బి రోడ్డు – రవిశెట్ల తండా – హైదర్ సాయిపేట రోడ్డుకు రూ.2.40 కోట్లు నిధులు మంజూరయ్యాయని నామ నాగేశ్వరరావు తెలిపారు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పాత మారేడుబాక రోడ్డుకు రూ.80 లక్షలు, చర్ల మండలం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి జాతీయ రహదారి 365 వరకు నిర్మించే రోడ్డుకు రూ.1.20 కోట్లు మంజూరు చేసినట్లు ఎంపీ నాగేశ్వరరావు వెల్లడించారు.

'టెట్'కు పకడ్బందీ ఏర్పాట్లు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు(టెట్) నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 15న ఉదయం 9.30నుంచి 12 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30నుంచి 5 గంటల వరకు రెండో పేపర్ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఉదయం పరీక్షకు 54 కేంద్రాలు ఏర్పాటుచేయగా 12,923 మంది, మధ్యాహ్నం పరీక్షకు 45 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా 10,480 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఇక కేంద్రాలకు బస్సుల ఏర్పాటు, నిరంతరాయ విద్యుత్ సరఫరాపై అధికారులు పర్యవేక్షిస్తారని కలెక్టర్ వెల్లడించారు.

ఓటు నమోదును ప్రోత్సహించండి

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవడమే కాక ఓటు వేసేలా అందరూ ప్రోత్సహించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. ఇందుకోసం యువతకు ప్రేరణ కల్పించేలా పోస్టర్లు, వీడియోల రూపకల్పన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరికీ అర్థమయ్యే రీతిలో తెలుగు, హిందీ, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో రూపొందించవచ్చని చెప్పారు. పోస్టర్ ఐదు ఎంబీకి మించకుండా, వీడియో 60 సెకన్లు దాటకుండా రూపొందించిhttps://tinyurl.com/electioncrea&than2023 కు ఈనెల 16వ తేదీలోగా పంపించాలని సూచించారు. ఉత్తమ ఎంట్రీ విజేతలకు రూ.20వేల నగదు బహుమతి ఇస్తారని తెలిపారు.

'సీతారామ' రూపకర్త కేసీఆరే..

- ఇందులో ఎవరి ప్రమేయం లేదు
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి దూరదృష్టితో సీఎం కేసీఆర్ రూపకల్పన చేశారే తప్ప ఇందులో ఎవరి ప్రమేయం లేదని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య స్పష్టం చేశారు. సత్తుపల్లిలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తర తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్టు తరహాలోనే వర్షాభావ పరిస్థితులు ఎదురైనా గోదావరి నీళ్లు ఏడాదంతా అందుబాటులో ఉండేలా సీతారామ ప్రాజెక్టును రూపకల్పన చేశారని చెప్పారు. ఇప్పటివరకు జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పార్టీని ఆదరించకపోయినా సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టితో అభివృద్ధికి రూ.వేలాది కోట్లు మంజూరు చేస్తూ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కాగా, కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రాల్లో ఇక్కడి ఏ సంక్షేమ పథకాన్ని అమలుచేయకపోగా... నాలుగు ముఠాలుగా తిరుగుతున్న ఆ పార్టీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని సండ్ర మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ఏనాడైనా పేద బిడ్డ పెళ్లికి నగదు ఇచ్చారా, ఆసరా పింఛన్లు పెంచారా అని ఆయన ప్రశ్నించారు. ఎన్టీఆర్, వైఎస్సార్ తర్వాత భారతదేశంలో అబ్బురపడేలా పాలన చేస్తున్నది సీఎం కేసీఆర్ మాత్రమేనని వెంకటరవీరయ్య తెలిపారు. కాగా, సత్తుపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, నర్సింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కాగా, నెలాఖరులో సత్తుపల్లిలోని వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. మూడుసార్లు తనను ఆదరించిన ప్రజలు మరోమారు కూడా గెలిపించాలని ఆయన ఈసందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎంపీపీ దొడ్డా హైమావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇస్టో పాథాలజీ ల్యాబ్ ప్రారంభం

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో ఇస్టో పాథాలజీ ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌ను బుధవారం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు ప్రాంభించారు. గర్భసంచి, థైరాయిడ్, కండరాలు తదితర ప్రాంతాల్లో ఏర్పడిన గడ్డలకు సంబంధించిన ఈ ల్యాబ్ ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ సదుపాయం లేక ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సరిత, ఆర్‌ఎంఓలు బి. శ్రీనివాసరావు, అమర్‌సింగ్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జ్ బాలు తదితరులు పాల్గొన్నారు.



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

అందరి చూపు... కాంగ్రెస్ వైపే

- అహంకారానికి కాలం చెల్లినట్లే...
- 'గడప గడపకు కాంగ్రెస్'లో పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మహిళకు కాంగ్రెస్ పథకాలను వివరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

ఖమ్మంఅర్బన్: బీఆర్‌ఎస్ నాయకుల అహంకారానికి కాలం చెల్లే రోజులు సమీపించాయని... ఇప్పుడు అందరూ కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఏదిఏమైనా ప్రజల దీవెనలతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గడప గడపకు కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాన్ని ఖమ్మం మూడో డివిజన్‌లో బుధవారం ప్రారంభించారు. తొలుత బల్లేపల్లి సెంటర్‌లోని రామాలయంలో పొంగులేటి ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు చేశాక నియోజకవర్గ నాయకులతో కలిసి భారీ ర్యాలీగా ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమలుచేసే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహలక్ష్మి ద్వారా రూ.5లక్షలు, ఉద్యోగాల భర్తీ, రూ.2లక్షల రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకాలు అమలుకావాలంటే కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. కాగా, గతంలో పాలించిన ఏ పార్టీలు ఇంత కక్షపూరితంగా వ్యవహరించలేదని, ఈ విషయాలను గమనిస్తున్న ప్రజలు అధికార పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, పార్టీ నగర అధ్యక్షుడు మహ్మద్ జావేద్, కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు వెంకటేశ్వర్లు, మలీదు జగన్, ముస్తఫా, కొప్పెర ఉపేందర్‌తో పాటు బాణాల లక్ష్మణ్, షేక్ ఇమాం, దుంపల రవికుమార్, బోడా శ్రావణ్‌కుమార్, గుడిపూడి రజనీకాంత్, కాంపాటి వెంకన్న, కీసర పద్మజారెడ్డి, కొంగర జ్యోతిర్మయి, శ్రీకళారెడ్డి, బానోత్ జ్యోత్స్న, ఆరిఫ్, కె.చంద్రశేఖర్, చల్లా రామకృష్ణ రెడ్డి, రాధాకృష్ణ, పర్వతి శ్రీను, మొగిలిచర్ల సైదులు, ఉపేందర్, హెచ్.వెంకటేశ్వర్లు ఉన్నారు.

క్లుప్తంగా

అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

కొణిజర్ల: యువతీ, యువకులు ఓటు హక్కు కోసం ఈనెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఎన్ మధుసూదన్‌నాయక్ సూచించారు. మండలంలోని తనికెళ్ల సమీపాన విజయ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యాన పకడ్బందీగా ఓటరు జాబితా సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈమేరకు అర్హులు ఓటరుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.చిన్నయ్య, కొణిజర్ల తహసీల్దార్ ఎర్రయ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఏర్పాటుచేసిన అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ బుధవారం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా 1,135 మంది అభ్యర్థులకు గాను 700మంది హాజర్యారు. వీరిలో మెడికల్ టెస్ట్ అనంతరం 188 మంది అర్హత సాధించారు. ఇక మరికొందరికి మెడికల్ టెస్ట్ గురువారం నిర్వహించనున్నారు. వర్షం కారణంగా ఆలస్యం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, ఇప్పటివరకు మొత్తం 7,397 మంది అభ్యర్థుల్లో 5,243 మంది హాజరు కాగా మెడికల్ టెస్ట్‌లో 2,133 మంది అర్హత సాధించారు.

పాలేరు రిజర్వాయర్‌ను సందర్శించిన సీఈ



అధికారులతో మాట్లాడుతున్న సీఈ విద్యాసాగర్

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌ను జలవనరులశాఖ సీఈ విద్యాసాగర్ బుధవారం పరిశీలించారు. సీఈగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి వచ్చిన ఆయన రిజర్వాయర్ ఇన్‌ఫాల్, ఔట్ ఫాల్ గేట్లతో పాటు ఫాలింగ్ గేట్లను పరిశీలించి నీటిమట్టం వివరాలపై ఆరా తీశారు. రిజర్వాయర్‌లో నీటిమట్టం 21.50 అడుగులుగా ఉండగా, తాజా వర్షాలతో 2,310 క్యూసెక్కుల వరద వస్తోందని అధికారులు వివరించారు. అనంతరం గేట్ల నిర్వహణపై సీఈ సూచనలు చేశారు. ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఈలు రత్నకుమారి, మధు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో అధికారుల తనిఖీ



షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

సత్తుపల్లి టౌన్: పట్టణంలోని పలు మెడికల్ షాపుల్లో అధికారులు బుధవారం తనిఖీ చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ జి.ప్రసాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఇన్‌స్పెక్టర్లు కె.దేవేందర్ రెడ్డి, సీహెచ్.సంపత్‌కుమార్ తనిఖీలు చేయగా... మత్తు ఇచ్చే టాబ్లెట్లు, ఇంజక్షన్లు, నిద్ర మాత్రలకు సంబంధించి స్టాక్, విక్రయాల రోజువారీ పరిశీలించారు. వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయించొద్దని, అవసరానికి మించి స్టాక్ నిల్వ చేయొద్దని నిర్వాహకులకు సూచించారు.

చికిత్స పొందుతున్న విద్యార్థిని మృతి

నేలకొండపల్లి: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థిచికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని(15) పదో తరగతి చదువుతోంది. గత శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. కాసేపయ్యాక ఆమెను గుర్తించిన కుటుంబీకులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. కాగా, ఓ యువకుడు వేధింపుల కారణంగా ఆమె ఆత్మహత్య చేసుకుందని సమాచారం.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	9,011	7,200
కందులు	11,600	6,000
మిర్చి	19,000	13,500
ఏసీ మిర్చి	24,500	18,500
తాలు మిర్చి	8,000	6,000
పత్తి	7,600	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,026

ముకుందా.. మురారీ!

నేడు కృష్ణాష్టమి పర్వదినం
- వేడుకలకు ముస్తాబైన ఆలయాలు
- ఉట్టి కొట్టేందుకు సిద్ధమైన భక్తులు



పాలేరులో శ్రీవేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ.. అన్న గీతోపదేశంతో మానవాళికి దిశానిర్దేశం చేశారు శ్రీకృష్ణభగవానుడు. మహాభారత యుద్ధాన్ని ముందుండి నడిపించిన మార్గదర్శి ఆయన. ద్వాపర యుగంలో జన్మించిన కృష్ణుడు నేటి కలియుగానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకే ఆయనను అందరూ తమ ఇష్టదైవంగా కొలుస్తారు. నందగోపాలుడి జన్మదినం సందర్భంగా నిర్వహించుకునే కృష్ణాష్టమి ప్రతి ఒక్కరికి ప్రత్యేకమైన రోజు. ఈ పండుగను గురువారం జరుపుకోనుండగా ప్రతీ ఇంట్లో పిల్లలను బాలకృష్ణుడిలా అలంకరించి సంబురాలు జరుపుకోవడం అనాదిగా వస్తోంది.

శ్రీకృష్ణజన్మాష్టమి ప్రాముఖ్యత

శ్రీకృష్ణుడు శ్రావణమాసంలో వచ్చే బహుళ అష్టమి రోజు జన్మించాడు. ఆ రోజునే కృష్ణాష్టమిగా జరుపుకుంటారు. మిగిలిన పూజలన్నీ ఉదయమే ప్రారంభమైతే కృష్ణాష్టమి రోజు మాత్రం మధ్యాహ్నం సమయంలో ప్రారంభమవుతాయి. కృష్ణుడు అర్ధరాత్రి జన్మించినట్లు పురాణాలు చెబుతున్నందున కృష్ణాష్టమి పూజ కూడా రాత్రి సమయంలో చేసే ఆచారం కొనసాగుతోంది. కృష్ణాష్టమి రోజున ప్రజలంతా చిన్ని కృష్ణుడిని ఆరాధిస్తారు. పసిపిల్లలను కృష్ణుడి రూపంలో అలంకరించి మురిసిపోతారు. ఇక చిన్ని కృష్ణుడి విగ్రహానికి పంచామృతాలతో, గోరువెచ్చని నీటితో అభిషేకం చేసి నూతన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరిస్తారు. కృష్ణుడికి మక్కువైన తులసీమాలను మెడలో వేసి పొన్న పూలతో పూజ చేయడం ఆనవాయితీ.

కృష్ణాష్టమి వ్రతం

శ్రావణమాసంలో వరలక్ష్మి వ్రతం, మంగళ గౌరీవ్రతం ఎక్కువగా చేస్తారు. వీటికి సమానమైన ప్రాధాన్యత కృష్ణాష్టమి వ్రతానికి ఉంది. అష్టమి తిథి రోహిణీ నక్షత్రం అర్ధరాత్రి సమయంలో ఉన్నప్పుడు మాత్రమే ఈ వ్రతాన్ని చేస్తారు. ఆ రోజు ప్రతీ తల్లి తనను తాను యశోదగా భావించుకుని.. పగలంతా ఉపవాసం ఉంటారు. కృష్ణుడు ఇంట్లోకి వస్తున్నట్లుగా పాదముద్రలు వేస్తారు. అర్ధరాత్రి వేళ కృష్ణుడు పుడతాడనే సమయం ఆసన్నమైనప్పుడు కాయం(బాలింతలకు పెట్టే కారం) పంచి పెడుతారు. కాల్చిన శొంఠితో దీన్ని తయారు చేస్తారు.

ఉట్టికొట్టే సంప్రదాయం

కృష్ణాష్టమి సందర్భంగా అంతటా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహిస్తారు. శ్రీకృష్ణుడికి ప్రీతిపాత్రమైన తెల్లటి వెన్నె, పెరుగు, పాలను కుండలో ఉంచి దానికి తాడు కట్టి పెద్ద కర్రకు కడుతారు. దాన్ని ఎవరు చేరగలుగుతారనే పోటీలో అంతా ఉత్సాహంగా పాల్గొంటారు. కులమతాలకతీతంగా యువకులు పాల్గొని విజేతగా నిలిచి బహుమతి అందుకునేందుకు పోటీ పడతారు.

యాదవులకు ప్రత్యేక పండుగ

శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని ప్రత్యేక పూజల కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోకి శ్రీకృష్ణుని ఆలయాలు అందంగా ముస్తాబయ్యాయి. ఆలయాలకు రంగులు వేయించడంతో పాటు విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే, శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గురువారం పూజలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బంది ఎదురుకాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక యాదవులు శ్రీకృష్ణుడిని కుల దైవంగా కొలుస్తారు. ఈమేరకు జిల్లా వ్యాప్తంగా వారు కృష్ణాష్టమి రోజున ప్రత్యేక పూజలు ఆచరించనున్నారు. అయితే, కులబేధం లేకుండా ఉట్టి వేడుకల్లో యువత ఉత్సాహంగా పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది.

శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

కూసుమంచి: మండలంలోని పాలేరులో శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని అర్చకులు చిరంజీవి, వినోద్, గోవిందరాజన్, జయరాం, సిద్దార్థ నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు కల్యాణాన్ని వీక్షించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈ పంటలు సాగు చేస్తే మేలు...

ఖమ్మంవ్యవసాయం: నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల లేకపోవడంతో ఆయకట్టు భూముల్లో సాగు చేయాల్సిన పంటలపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి సూచనలు చేశారు. గోదావరి పరీవా హక ప్రాజెక్టుల్లో నీరు ఆశాజనకంగానే ఉన్నా, కృష్ణ పరీవాహక ప్రాంత జిల్లాల్లోని ప్రాజెక్టుల్లో ఆ పరిస్థితి లేదు. ఈనేపథ్యాన వరిసాగు చేసే భూముల్లో రైతులు పంటలు విత్తుకోలేదు. ఈమేరకు నేలలు, నీటి వసతి, వర్షాధారంగా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. తేలిక లేదా మధ్యస్థ నేలల్లో వర్షాధారంగా ఉలవలు, బొబ్బెర్లు(అలసందలు) వేసుకోవచ్చని చెప్పారు. బరువైన నేలల్లో వర్షాధారంగా ఉలవలు, బొబ్బెర్లు, జొన్న పంటలను వేసుకోవచ్చని తెలిపారు. ఇక తేలిక, మధ్యస్థ నేలల్లో నీటి వసతి ఆధారంగా పెసర, మినుము, కంది, వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు, మొక్కజొన్న, జొన్న, ఆముదం పంటలు సాగు చేయాలని, బరువైన నేలల్లో నీటివసతి ఉంటే కంది, ప్రొద్దుతిరుగుడు, మొక్కజొన్న, జొన్న, ఆముదం పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. వరి మాగాణుల్లో మొక్కజొన్న, కంది, ప్రొద్దుతిరుగుడు, ఆముదం, ఇతర పంటలు సాగు చేసినప్పుడు అకాల వర్షాలతో నీరు నిలిస్తే మొక్కలు తెగుళ్ల బారిన పడి నష్టపోయే ప్రమాదముందని తెలిపారు. ఈనేపథ్యాన బోదెలు, సాళ్ల పద్ధతి అవలంభిస్తే మంచిదని వెల్లడించారు. కాగా, రైతాంగం ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకొని మెట్ట పంటలు విత్తుకోవాలని ఆయన సూచించారు.

విద్యుత్‌తో జాగ్రత్త

వర్షాల నేపథ్యంలో రైతులు, వినియోగదారులు విద్యుత్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు ఓ ప్రకటనలో సూచించారు. తడి చేతులతో విద్యుత్ పరికరాలు, తీగలను తాకొద్దని, రైతులు వ్యవసాయ పంపుసెట్ల వద్ద జాగ్రత్త వహించాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారికంగా ఫ్యూజులు మార్చకుండా సిబ్బందికి సమాచారం ఇవ్వాలని చెప్పారు. సమస్యలు ఎదురైతే టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 0028కు లేదా 1912కు ఫోన్ చేయాలని సీఎండీ తెలిపారు.

ఉత్తమ పీఎస్‌గా మధిర రూరల్



మధిర రూరల్ పోలీస్ స్టేషన్

మధిర: కేసుల పరిష్కారంలో ముందంజలో నిలిచిన మధిర రూరల్ పోలీస్‌స్టేషన్ ఉత్తమ స్టేషన్‌గా ఎంపికైంది. రాష్ట్రంలోని ముప్పై పోలీస్ స్టేషన్లను ఎంపిక చేయగా మధిర రూరల్ స్టేషన్‌కు జాబితాలో స్థానం దక్కింది. ఈ స్టేషన్ పరిధిలో ఏడాది కాలంలో మూడు చోరీలు జరగగా, వాటిని చేధించి 70 శాతం సొత్తు రికవరీ చేశారు. అలాగే, మహిళలపై జరిగిన దాడులకు సంబంధించిన తొమ్మిది కేసుల్లో ఎనిమిది, ఎస్సీ, ఎస్టీ కేసులు మూడు, ఐదు రోడ్డు ప్రమాదాల కేసుల్లో నాలుగు, మహిళల అదృశ్యానికి సంబంధించి 12 కేసుల్లో తొమ్మిందిని పరిష్కరించార. ఈ నేపథ్యాన మధిర రూరల్ ఉత్తమ స్టేషన్ ఎంపిక కావడంతో మధిర సీఐ వసంత్‌కుమార్, రూరల్ ఎస్‌ఐ షేక్ రఫీని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ అభినందించారు.

వంట గ్యాస్ బిల్లులు ఇప్పించాలని వినతి



డీడీకి వినతిపత్రం అందజేస్తున్న టీఎన్జీవోస్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో వినియోగించిన వంటగ్యాస్‌కు సంబంధించిన బిల్లుల సమస్య పరిష్కరించాలని వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు వారు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్.సాగర్‌తో కలిసి బుధవారం ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం డీడీ మాట్లాడుతూ త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ ఫోరమ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోటపాటి రుక్మారావు, ఎన్.నాగేశ్వరరావుతో పాటు నాయకులు కె.తిరుపతిరావు, ఎస్.విజయ, నాగమణి, ప్రతాప్‌సింగ్, బుద్దా రామకృష్ణ, శాబాసు జ్యోతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరుగుతున్న గోదావరి

భద్రాచలంటౌన్: ఎగువన కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి స్వల్పంగా పెరుగుతోంది. బుధవారం రాత్రి నీటిమట్టం 24 అడుగులకు చేరింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద ప్రవాహం మరికొంత పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

శ్రద్ధగా చదివితే ఉన్నత స్థానాలకు...



చక్రపాణిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని శ్రద్ధగా చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని రిటైర్డ్ ఐఏఎస్ చక్రపాణి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏఎస్ఆర్ శాంతినగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో చక్రపాని మాట్లాడుతూ విద్యార్థి దశలో సెల్‌ఫోన్‌కు బానిసలు కాకుండా చదువుపైనే దృష్టి సారించాలని తెలిపారు. గతంలో మూసివేసే పరిస్థితి ఉన్న కళాశాలలో ఇప్పుడు సామర్థ్యానికి మించి ప్రవేశాలు పొందడం సంతోషంగా ఉందని తెలిపారు. కాగా, విద్యార్థుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అధ్యాపకులు తీర్చిదిద్దాలని సూచించారు. ఆతర్వాత ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, అధ్యాపకులు సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- ఏన్కూరు మండలం హిమామ్‌నగర్ వద్ద ఘటన
- మృతులిద్దరూ సుజాతనగర్ మండల వాసులు
- ఇరువురూ సమీప బంధువులే...



నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనం



వంశీ (ఫైల్)



సాంబయ్య (ఫైల్)

ఏన్కూరు/సుజాతనగర్: ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల నుంచి అందిన సమాచారం ప్రకారం ... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం నాయకులగూడెం జీపీ పరిధి లెనిన్‌నగర్‌కు చెందిన మడియం సాంబయ్య(28), వేపలగడ్డకు చెందిన పూనేం వంశీ(26) ఇద్దరు బావబామ్మరుదులు. సుతారీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న వీరు ద్విచక్ర వాహనంపై ఏన్కూరులోని బంధువును కలిసేందుకు వచ్చారు. ఇక్కడి నుంచి తిరిగి వేపలగడ్డకు వెళ్తుండగా కొత్తగూడెం నుండి ఏన్కూరు వైపు వస్తున్న బొలేరో వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఇద్దరు సమీపంలోని పొలాల్లోని ఎగిరిపడగా తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో సాంబయ్యకు ఇంకా వివాహం కాలేదు. ఇక వంశీకి నాలుగేళ్ల క్రితం వివాహం జరగగా భార్య సరళతో పాటు మూడేళ్ల కుమార్తె, నాలుగు నెలల కుమారుడు ఉన్నారు. వీరిద్దరి మృతితో లెనిన్‌నగర్, వేపలగడ్డలో విషాదం నెలకొంది. కాగా, ఘటనాస్థలికి ఎస్‌ఐ బాదావత్ రవి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

సిరిపురం బ్యాంకులో గోల్‌మాల్

- రూ.10లక్షల మేర నగదులో తేడా

మధిర: మధిర మండలం సిరిపురంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ)లో నగదు గోల్‌మాల్ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ బ్యాంకులో సుమారు రూ.10 లక్షలకు పైగా నగదు తేడా వచ్చినట్లుగా బ్యాంకు రీజియన్ అధికారులు గుర్తించారు. అయితే, బ్యాంకులో పనిచేస్తున్న అధికారులకు మాత్రం ఎలాంటి తేడా కనిపించలేదని సమాచారం. కానీ ఆన్‌లైన్‌లో తనిఖీ చేసినప్పుడు నగదు తేడా ఉన్నట్లు రీజియన్ అధికారులు గుర్తించి బ్యాంకులో పనిచేసి బదిలీపై వెళ్లిన క్యాషియర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇదే విషయమై సిరిపురం ఏపీజీవీబీ మేనేజర్ రవికుమార్ ఈనెల 1న మధిర రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారని రూరల్ ఎస్‌ఐ షేక్ రఫీ తెలిపారు. సాంకేతిక లోపం కారణంగా నగదు జమ కాలేదా లేక అవకతవకలు జరిగాయా అన్న కోణంలో రీజియన్ అధికారులు విచారణ చేస్తున్నారని బ్యాంకు మేనేజర్ రవికుమార్ వెల్లడించారు.

పలు గ్రామాల్లో చోరీలు

మధిర: మధిర మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి చోరీలు జరిగాయి. మాటూరుపేట రామాలయంలోకి ప్రవేశించిన దుండగులు హుండీ పగులగొట్టి అందులో నగదు అపహరించారు. అలాగే, ఆలయ సమీపాన వంగర భద్రయ్య ఇంట్లోకి చొరబడి సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. ఇంకా పులికొండ కృష్ణయ్య ఇంట్లో ఉన్న ద్విచక్ర వాహనాన్ని కూడా తీసుకెవెళ్లారు. అదే గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో హుండీ చోరీకి యత్నించినా సాధ్యపడకపోవడంతో వదిలేసి వెళ్లారు. ఇంకా సిద్ధినేనిగూడెం గ్రామంలో దూదేకుల మస్తాన్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని అపహరించి మాటూరుపేటలోని ఒక ఇంట్లో వదిలి వెళ్లారు. ఈమేరకు ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఆయా గ్రామాల్లో పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ మోటార్లలో కాపర్‌వైరు చోరీ

ముదిగొండ: మండలంలోని వల్లభిలో మంగళవారం రాత్రి ఆరు విద్యుత్ మోటార్లలోని కాపర్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ విషయమై వల్లభికి చెందిన రైతు వెంకటేశ్వర్లు బుధవారం ముదిగొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ నరేష్ బుధవారం గ్రామానికి వచ్చి పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు యత్నిస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని చెరువుమాధారానికి చెందిన సాయిపవన్, సాయికిరణ్ బైక్‌పై బుధవారం సాయంత్రం నేలకొండపల్లికి వస్తున్నారు. ఈక్రమంలో కోనాయిగూడెంకు చెందిన గోపీచంద్ బైక్‌పై నేలకొండపల్లి వస్తుండగా, కూసుమంచి రోడ్డులో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈఘటనలో ముగ్గురికి గాయాలు కాగా, నేలకొండపల్లిలో ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పార్టీల నాయకులతో కమిషనర్ సమావేశం



ఐటీ హబ్‌లో మాట్లాడుతున్న కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆదర్శ్ సురభి బుధవారం వివిధ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ, మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, బూత్ లెవల్ ఏజెంట్ల నియామకాల పట్ల చర్చించారు. అనంతరం సెక్టోరియల్ ఆఫీసర్ పరిధిలోని సూపర్‌వైజర్ ఆఫీసర్లు, బీఎల్‌ఓలకు యాప్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీటీ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

ఖమ్మం అర్బన్: యువత విధిగా ఓటరుగా నమోదు చేసుకోవడంతో ఓటు హక్కు వినియోగించుకోవాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి సూచించారు. నగరంలోని ఐటీ హబ్ ఉద్యోగులతో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కు ఉందా, లేదా అనే విషయాన్ని జాబితా ద్వారా తెలుసుకుని లేని వారు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే, యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే అన్ని వివరాలు తెలుస్తాయని ఆయన వెల్లడించారు.

ప్రణాళికాయుతంగా ఎన్నికలకు వెళ్దాం...

సీపీ విష్ణు ఎస్.వారియర్

ఖమ్మంక్రైం: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యాన ఇప్పటికే నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే ప్రశాంత వాతావరణంలో పోలింగ్ పూర్తిచేయొచ్చని పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. కమిషనరేట్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ జిల్లాలో అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి నేరచరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే, రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలని తెలిపారు. కాగా, పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో విచారణ వేగంగా పూర్తిచేయాలని సీపీ సూచించారు. ఇక ఈనెల 9న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని సీపీ తెలిపారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఖమ్మంఅర్బన్: సర్వశిక్ష అభియాన్ పరిధిలో పనిచేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు, సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల సమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తోందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోత్కూరి మధు వెల్లడించారు. ఖమ్మంలోని రోటరీనగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన సీఆర్పీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు మినిమమ్ బేసిక్ పే ఇవ్వాల్సిన అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సీఆర్పీల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరయ్య, బాబురావుతో పాటు కట్టా శేఖర్‌రావు, ప్రభాకర్, ఇస్మాయిల్, అనురాధ, నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

ఖమ్మంసహకారనగర్: ఉపాధ్యాయ బదిలీలను అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారగాని నారాయణ, ముత్తినేని సురేష్ కోరారు. ఖమ్మంలో బుధవారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో వారు మాట్లాడుతూ స్పౌజ్ విషయంలో సాంకేతికతను ఉపయోగించి సమర్థవంతంగా బదిలీలను నిర్వహించాలని కోరారు. తప్పుడు సమాచారం ఇచ్చిన ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బదిలీల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. కాగా, విద్యాశాఖ ఉన్నతాధికారులు గందరగోళంగా ఇచ్చే జీఓలతో ఉపాధ్యాయులు ఇబ్బందికి గురవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కొనపర్తి శ్రీనివాసరావు, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి మృతిపై సంతాపం

సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం సింగిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జె.కవిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. విద్యాశాఖ అనాలోచిత చర్యతోనే ఆమె మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. ఐచ్ఛిక సెలవును రద్దు చేసినట్లు ఆలస్యంగా సమాచారం ఇవ్వటంతో హడావుడిగా పాఠశాలకు వెళ్లే క్రమాన రోడ్డు ప్రమాదం జరిగిందని తెలిపారు.

మహిళల సతా చాటాలి...

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జి షాహినా



కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశమైన మహిళా నాయకులు

ఖమ్మంసహకారనగర్: రాబోయే ఎన్నికల్లో మహిళల సత్తాను చాటాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జి షాహినా పాలఖడ్ అన్నారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆధ్వర్యాన బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మహిళా కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ అమర్జహాన్ బేగంతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మహిళలకు న్యాయం జరగడమే కాక గౌరవం దక్కుతుందని తెలిపారు. మహిళలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని చెప్పారు. అనంతరం కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహమ్మద్ జావిద్ మాట్లాడగా 32వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జ్యోతిర్మయి, స్వరూప, పద్మజారెడ్డి, చంద్రకళ, లక్ష్మి, ఝాన్సీ, పుష్ప, దివ్య, రేణుక, అనూష, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.